# తూర్పుగాలి

అమెరికాలో కూడా వెలుగురేఖల కోసం తూర్పుదిక్కుకే చూడక తప్పదు!

"మళ్ళీ తెల్లారిందా?" నిద్రలేస్తూనే అనుకున్నాను. కప్పుకొన్న రగ్గును పక్కకు తొలగించి కిటికీ దగ్గరికి వెళ్ళాను. కర్టెన్స్ పక్కకు నెట్టిచూస్తే 'శాండూర్ డ్రైవ్'లోని ఇళ్ళన్నీ చలికి ముడుచుకుపోయి వొణుకుతున్నట్లుగా కన్పించాయి.

ఇంతదూరం ఎందుకొచ్చాను? అంగలూరు ఎక్కడ? అమెరికా ఎక్కడ? పాతిక ఎకరాల మాగాణి వుంది. రైసుమిల్లు వుంది తనకు. పచ్చటి పొలాల్లో తిరుగుతూ, పిట్టల్ని పలకరిస్తూ చెరువు గట్టుమీద కూర్చుని ఈల పాట పాడుకుంటూ ఆనందంగా వుండక... దాలర్ల వేటలో పడి అమెరికాకు నేను ఎందుకొచ్చినట్లు? నేనుంది 'గార్డెన్ స్టేట్'లో న్యూజెర్సీనే ఈ పేరుతో పిలుస్తారు. ఎఫ్.ఎమ్.ట్రాన్సిస్టర్, లిథియం బ్యాటరీలు, బల్బులు. ఆవిష్కరణలన్నీ ఈ నగరంలో జరిగాయి. గొప్ప నగరం. ధనిక దేశంలోనే ఉన్నాను నేను. అయినా ఏదో అసంతృప్తి. అప్పుడప్పుడు గ్లూమీగా అన్పిస్తుంది. గుండెల్లో గుబులుగా ఉంటుంది. అయినవాళ్ళు అంగలూరులో వుంటే నేను వాళ్ళకు దూరంగా ఇక్కడున్నాను. 'వివేకవంతుడు ప్రపంచానికి అనుగుణంగా సర్దుకుంటాడు. అవివేకి తనకు అనుగుణంగా ప్రపంచం వుండాలని కోరుకుంటాడు. మనం ఎక్కడ వుంటే అక్కడి వాతావరణానికి అడ్జస్ట్ అయిపోవాలి' అంటూ వుంటుంది స్రవంతి.

నాన్న నా చిన్నప్పుడే చనిపోయాడు. అమ్మ కష్టపడి నన్ను చదివించింది. ఆమె పేరుమీద ఆస్తిపాస్తులు వున్నాయి కాబట్టి, ఆమెని పెళ్ళి చేసుకోవడానికి ఎంతోమంది ముందుకు వొచ్చారు. అయినా తన సుఖంచూసుకోకుండా, నన్ను కంటికి రెప్పలా చూసుకుంది. రాత్రిళ్ళు నేను చదువుకుంటుంటే మేలుకుని వుండేది. నాతోపాటే స్కూలు దాకా నడిచి వొచ్చేది. బి.టెక్ చదివేటప్పుడు నన్ను హాస్టల్లో వుంచడానికి ఇష్టపడకుండా

తనే విశాఖపట్నం వొచ్చి, ఇల్లు అద్దెకు తీసుకుని, వండిపెట్టింది. నాకు ఏ లోటూ రాకుండా చూసిన ఆమె చివరి క్షణాల్లో... నేను పక్కన లేకుండా చేసింది అమెరికా జీవితం! ఆమె చనిపోయేక వెళ్ళాను నేను... ఇండియాకు!

ఇక్కడ రూమ్ హీటరు వున్నా, చలిచలిగా వుంది.

అక్టోబర్ వొచ్చేసింది. శీతాకాలం వస్తోందంటే చాలు చెట్లు సరికొత్త రంగుల ఆకులతో ముస్తాబవుతాయి. మంచుకురిసే సమయానికి ముందే. ఆకులన్నీ రాలిపోయి చెట్లు మోడులవుతాయి. ఆకులురాలిపోయే ముందు వివిధ రంగులు సంతరించుకుని కనువిందుచేస్తాయి. రెసిడెన్షియల్ కాలనీలో కూడా దట్టంగాచెట్ల వరసలూ, ఆ చెట్లమధ్య తిరిగే జింకల గుంపులూ కన్పించడం మామూలే.

ఇప్పుడు ఇటుకేసి ఓ తల్లి జింక, దాని వెనకే జింక పిల్ల వొచ్చాయి. పాలుతాగాలో, తాగనవసరంలేదో తేల్చుకోలేకపోతోంది జింక పిల్ల. తాగాలనే కోరిక బలంగా లేదేమో.... పచ్చికను, ఇంటిముందున్న గులాబీ మొక్కల్ని తాకుతూ ముందుకు కదిలిపోతోంది తల్లి వెనకే.

ఎక్కడో చిన్న శబ్దం.

జింకలు బెదిరిపారిపోయాయి.

నా భుజంమీద మెత్తటి చేతి స్పర్శ.

ఆ చెయ్యి ఎవరిదోనని వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరంలేదు. వెనక నిలబడింది స్రవంతి. "ఈ రోజు హాలిడే కదా! ఎంజాయ్ చేయొచ్చు" అంది.

"ఏం ఎంజాయ్ చేస్తాం? డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌కు వెళ్ళడం, ఫుడ్ ఐటమ్స్, స్టేషనరీ, బెవరేజ్ డ్రింక్స్ కొనుక్కోవడం, ఇంటికి తిరిగి వొచ్చి రూమ్స్ క్లీన్ చేసుకోవడం , డిష్ వాషర్‌లో... తిన్న ప్లేట్లు పడెయ్యడం... ఇవేగా మనం ఎంజాయ్‌చేసే పనులు" అన్నాను విసుగ్గా.

"ఉదయాన్నే అంత విసుగు ఎందుకు డియర్? ఈ రోజు గీతిక వాళ్ళింట్లో బర్త్‌డే పార్టీ వుంది. హ్యాపీగా గడిపేద్దాం"

పార్టీలంటే స్రవంతికి మహా ఇష్టం. పిలవడం ఆలస్యం. రెండు మూడురకాల వంటలు చేసుకుని అక్కడ వాలిపోతుంది. పార్టీ అయ్యేక అక్కడ మిగిలినవి గిన్నెల్లో సర్దుకుని, ఇంటికి తెచ్చుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుని, నాలుగైదు రోజులు తింటుంది.

పార్టీకి వొచ్చినవాళ్ళంతా నోటికొచ్చింది మాట్లాడుతుంటారు. ఎవరి గొప్పలు వాళ్లు చెబుతూ వుంటారు. యాభై, అరవైయ్యేళ్ళ కిందట అమెరికా వొచ్చిన డాక్టర్లు, ఇంజనీర్లు బాగా సంపాదించుకున్నారు. ఈ మధ్య వొచ్చినవాళ్ళంతా ఇబ్బంది పడుతున్నారు. పాతతరం... కొత్తతరాన్ని కలుపుకోరు. సుపీరియారిటీ కాంప్లెక్స్.

"అమెరికా ఈజ్ డిమినిష్డ్ నేషన్. అన్ ఎంప్లాయ్‌మెంట్, హౌసింగ్ ప్రాబ్లమ్స్, నో ప్రోగ్రెస్ ఇన్ బయో టెక్నాలజీ. పెరిగిన విదేశీ వస్తువుల కొనుగోళ్ళు, దేశీయ వస్తువుల ఉత్పత్తితగ్గిపోవడం,నిరుద్యోగం... అన్నీసమస్యలే" అంటూ ఒకాయన చర్చ మొదలు పెడతాడు.

"ఇండియాకు తిరిగెళ్ళిపోతాను" అంటాడు మరొకాయన.

"ఇండియాలో ఏముంది? ఇండియా ఈజ్ కంట్రీ ఆఫ్ స్నేక్స్, బెగ్గర్స్, కరెప్షన్, బ్యాడ్‌రోడ్స్. ఐ హేట్ టు గో టు ఇండియా" అనేస్తాడు ఇంకో పెద్దమనిషి వాళ్ళ మాటలు వింటుంటే చిర్రెత్తుకొస్తుంది నాకు.

ఇండియా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా, విజయపతాకం ఎగరేస్తూనే వుంటుంది. ఆర్థికమాంద్యానికి అన్ని అగ్రదేశాలూ కుదేలైనా,భారతదేశం తట్టుకుందంటే గొప్ప విషయం కాదూ! కిందిస్థాయివాళ్ళకు తెలియకపోయినా... ఇండియా ఇన్నర్ కెపాసిటీ, ఇన్నర్‌స్ట్రెంత్ విదేశాలలోని అగ్రనేతలకు అవగతమైంది. అందుకే అందరూ ఇండియాతో స్నేహహస్తం చాస్తున్నారు. మరో పదిహేనేళ్ళకు ఇండియా అగ్రదేశం అవుతుందని అందరికి తెలుసు.

ఇదే విషయంచెప్పి అందరి నోళ్ళూ మూయించాలనిపిస్తుంది. కానీ ఇష్టం లేకపోయినా ఎదుటివాళ్ళు చెప్పింది వినాలి. అదీ అక్కడి మర్యాదస్తుల లక్షణం!

ఎప్పుడూ మౌనరాగాలు ఆలాపించడమేగానీ, దబాయించి మాట్లాడటం తెలీదు నాకు.

"నన్ను ప్రేమిస్తున్నావ్ కదూ!" అంది స్రవంతి ఓ రోజు సినిమా హాల్లో.

ఆమెను నేను ప్రేమించడం ఏమిటి? ప్రేమంటే ఏమిటో నాకు తెలిసి ఛస్తే గదా! నాకు తెలిసిన విషయం వొక్కటే! మేనమామ కూతురు లహరిని పెళ్ళి చేసుకోవాలని అమ్మ ఎప్పుడూ చెబుతూ వుండేది. లహరి నా భార్య అవుతుందనుకునేవాణ్ణి.

"మీ మామయ్య నరహరి వ్యాపారాల్లో నష్టపోయాడురా! వాడిని మనమే ఆదుకోవాలి. వాళ్ళమ్మాయిని నువ్వు పెళ్ళి చేసుకో! పిల్ల కుదురుగా వుంటుంది. సంసార

పక్షం... చిదిమి దీపం పెట్టుకోవొచ్చు, నా మాట కాదనకు నాయనా!" అంటుండేది అమ్మ.

నేను బి.టెక్. చదివేటప్పుడు, స్రవంతితో పరిచయం అయ్యింది. ఎన్నో సంవత్సరాల నుంచి పరిచయం వున్నదానిలా ప్రవర్తించేది. నేను ఏ టిఫిన్ తినాలో తనే నిర్ణయించేది. నా బట్టల సెలక్షనూ ఆమెదే! ఆమెకు నచ్చిన సినిమాలకే నేనూ వెంట వెళ్ళాలి. అమెరికా కూడా ఆమె వెనకే వెళ్ళాను.

అప్పట్లో... తల్లి చెప్పిన విషయమే స్రవంతికి చెప్పాను.

"నీ యిష్టం. లహరినే పెళ్లి చేసుకో! అడ్డుచెప్పడానికి నేను ఎవరిని? కానీ ఒక్క విషయం గుర్తుంచుకో! నువ్వు నీడపట్టు మనిషివి. ఎండలో తిరగలేవు. సొంతంగా ఏ పనీచేసుకోలేవు. నీ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి నాలాంటి చురుకైన అమ్మాయి నీకు తోడుండాలి. నేను నిన్న ప్రేమించాను. నన్ను కాదని మరొకరిని పెళ్ళిచేసుకుంటే ఆ ముహూర్తం సమయానికే" ఓ క్షణం చెప్పడం ఆపింది స్రవంతి.

"మరొకర్ని పెళ్ళిచేసుకుంటావా?" అప్పుడే ఆత్రంగా అడిగాను నేను.

"కాదు... ఆత్మహత్య చేసుకుంటాను" అందామె స్పష్టంగా, తొట్రుపాటు లేకుండా.

అంతే, కంగారుపడిపోయాను నేను.

అన్నంత పనీచేస్తుంది. స్రవంతి మహామొండిదని నాకు బాగా తెలుసు.

మొహానికి పట్టిన చెమట తుడుచుకుంటూ "సర్లే! నీ ఇష్టప్రకారమే కానివ్వు. మా అమ్మతో నువ్వే మాట్లాడి ఒప్పించు" అన్నాను ఆ రోజే.

స్రవంతి అమ్మకు ఏం చెప్పిందోగానీ, అమ్మ మెత్తబడిపోయింది.

ఆ తర్వాత తెలిసింది.... 'ఐదో తరగతితో చదువు ముగించిన లహరిని చేసుకుంటే, ఆ పిల్ల అమెరికాలో ఇబ్బంది పడుతుంద'ని అమ్మకు చెప్పింది స్రవంతి. నేను ఆ పిల్లతో అమెరికాలో నెగ్గుకురాలేనని కూడా చెప్పింది.

తర్వాత, స్రవంతితో నా పెళ్లి జరిగిపోయింది.

❖ ❖ ❖

"పార్టీకి నేను రాను. నువ్వెళ్ళు" అన్నాను.

"నేను ఒక్కదాన్నే వెళితే నవ్వుతారందరూ. మీరు రాకపోతే నేనూ వెళ్ళను" అంది స్రవంతి.

స్నానం, బ్రేక్‌ఫాస్ట్ అయ్యేక న్యూబ్రౌన్స్ విక్‌లోని లైబ్రరీ దగ్గర నన్ను డ్రాప్ చేసిందామె. తను వాల్‌మార్ట్ స్టోర్సుకు వెళ్ళింది.

వేలపుస్తకాలున్నాయి లైబ్రరీలో. పది పుస్తకాలయినా ఇంటికి తెచ్చుకోవచ్చు. లైబ్రరీ ముందు రెండు బాక్సులు వున్నాయి. రిటర్న్‌చేసే పుస్తకాలు అందులో పడేయొచ్చు కూడా.

జాన్ స్టైయిన్ బెక్ రాసిన పుస్తకం 'ది గ్రేప్స్ ఆఫ్ ర్యాత్' నాలుగైదుసార్లు చదివాను. మాస్టర్ పీస్ ఆ పుస్తకం. ఆ రచయిత రాసిన ఇతర పుస్తకాల కోసం వెదికాను. ఫర్‌గాటన్ విలేజ్, ఈస్ట్ ఆఫ్ ఈడెన్, ది మూన్ ఈజ్ డౌన్ వంటి కొన్ని పుస్తకాలు దొరికాయి.

లైబ్రరీ ముందు మెట్లమీద కూర్చున్నాను. ఏవో ఆలోచనలు నా మెదడు పొరల్లో మెదులుతున్నాయి.

❖ ❖ ❖

బడిలేని రోజుల్లో పొలాల గట్లమీద తిరగడం, మామిడి తోటల్లో చేరి తోటమాలికి తెలియకుండా కాయలు కొయ్యడం, చెరువులో ఈతగొట్టడం, చెట్లమీద ఎక్కి కోతి కొమ్మచ్చి ఆడటం, కంది చేనుకు అడ్డంపడి జేబునిండా కందికాయలు కోసుకుని తినడం, చింతతోపులో చెట్లనీడలో మధ్యాహ్నం పూట నిద్రపోవడం.... ఇదే... దినచర్య.

ఆకాశంలో కదలాడే తెల్లమబ్బులు ఏ ఆకృతిలో వున్నాయో చూడటం, ఎగిరే పక్షులను చూసి ఆనందించడం... క్షణం తీరిక వుండేది కాదు.

"అన్నం తినకుండా పొలంగట్లమీద ఆ తిరుగుళ్ళు ఏమిట్రా? పురుగూ పుట్రా వుంటాయి. జాగ్రత్తరా బాబూ!" అనేది అమ్మ.

"ఎండల్లో తిరుగుతున్నారు. వడదెబ్బ తగులుతుంది" పొలాల్లో ఎదురుపడ్డ రైతులు హెచ్చరించేవాళ్ళు.

ఏ హెచ్చరికల్నీ లెక్కచెయ్యని బాల్యం అది!

శివుడంటే నాకు ఇష్టం. ఎప్పుడూ వాడి చుట్టూ తిరుగుతుండేవాడిని. నాకంటే రెండేళ్ళు చిన్నవాడే! కానీ అన్ని విషయాల్లో వాడిదే పైచేయి. చెట్లు ఎక్కికాయలు కొయ్యడంలో, చెరువులో ఈతకొట్టడంలో వాడే మొనగాడు. కుందుళ్ళలో అందరికంటే ఎక్కువదూరం వాడే కుందేవాడు. చెడుగుడులో కూడా వాడిదే పైచేయి. కూతకు వెళ్ళాడంటే నలుగురైదుగురిని లాక్కొచ్చేవాడు. నన్ను ఎవరన్నా తిడితే వాడికి చెప్పేవాడిని. చైనా గోడలా

నా చుట్టూ విస్తరించుకుని వుండేవాడు. నన్ను తిట్టినవాడిమీద ఒంటికాలి మీద లేచి చితకబాదేవాడు. వాడు చేసిన పనికి లంచంగా మరమరాల వుండలో నూగు జీడీలో పప్పుచెక్కలో ఇవ్వాల్సి వొచ్చేది.

శివుడు ఎక్కడ సంపాదించాడో కానీ, ఓ 'ఉండేలు' తెచ్చి నాకు చూపించాడు. పంగల కర్రకి రబ్బరు కట్టి వుంది. ఆ రబ్బరులో రాయి వుంచి, వొడుపుగా లాగి కొడితే, రాయి విసురుగా వెళ్లి, దేనికి గురిపెడితే దానికి తగులుతుంది.

"నిన్న మూడు పిట్టల్ని పడగొట్టాను ఈ ఉండేలుతో" అన్నాడు శివుడు మెరిసే కళ్ళతో.

వాడివైపు ఆరాధనగా చూశారు చుట్టూ మూగిన పిల్లలు.

"ఈ వుండేలు ఎవరికీ ఇవ్వను. మా నాన్న ఎవరికీ ఇవ్వద్దన్నాడు" అన్నాడు శివుడు.

"నాక్కూడా ఇవ్వవా?" అందరూ వెళ్ళిపోయేక ప్రాధేయపడుతూ అడిగాను.

"నువ్వంటే నాకు ఇష్టం. నువ్వు అడిగావు కాబట్టి నీకు ఇస్తాను. రూపాయి ఇస్తే ఈ ఉండేలు ఇస్తాను" అంటూ షరతు పెట్టాడు.

నోటు పుస్తకం కొనుక్కోవాలని అమ్మకు అబద్ధం చెప్పి, రూపాయి తీసుకుని శివుడికి ఇచ్చాను.

ఉండేలు నా సొంతం అయ్యింది. ఆ రాత్రి నిద్రపట్టలేదు. 'ఎప్పుడు తెల్లవారుతుందా?... లహరి ముందు ఉండేలుతో నా విద్యను ఎంత బాగా ప్రదర్శించాలా?....' అనుకుంటూ ఆ ఉద్వేగంలో పక్కమీద చాలాసేపు అటూ ఇటూ దొర్లాను.

మరురోజు ఉదయాన్నే లహరి చెయ్యిపట్టుకుని మామిడితోటలోకి లాక్కెళ్ళాను.

ఎంతసేపూ వెదికినా, చెట్టుకొమ్మల మీద ఒక్క పిట్ట కూడా కన్పించలేదు. అక్కడి నుంచి చింతతోపు దగ్గరికెళ్ళాం. ఒకటి రెండు పిట్టలు కన్పించాయిగానీ, గురిచూసి ఉండేలు నుంచి రాయి విసిరేసరికి... అవి ముందే ఎగిరిపోయాయి.

విసుగుపుట్టి చెరువు కట్టమీదకు వెళ్ళాం. నేరేడు చెట్టుకిందకు చేరుకున్నాం.

లహరి తన దగ్గరున్న జామకాయని లంగాతో కొరికి "కాకి ఎంగిలిలే! ఫరవాలేదు... తీసుకో" అంది.

జామకాయ రుచిగా వుండటంతో "తియ్యగా బాగుందే... ఆ ముక్క కూడా ఇవ్వు" అంటూ లహరి చేతిలోని జామకాయ ముక్కని లాక్కుని తిన్నాను.

నేరేడు చెట్టుమీద పిట్ట కువకువలాడుతున్నట్లనిపించింది.

తలెత్తి చూశాను.

ముక్కుని చెట్టుకొమ్మకు రాస్తూ, అటూ ఇటూ కదులుతోంది బూడిద రంగులోని పిట్ట.

సవ్వడి చెయ్యకుండా రెండు నిముషాలు అలాగే వుండిపోయాను.

లహరిని కూడా మాట్లాడ వద్దన్నట్లు చేత్తో సైగచేశాను.

గురిచూసి కొట్టాను.

గింగరాలు తిరుగుతూ ఆ పిట్ట... కిందపడింది.

"అయ్యయ్యో! పిట్ట పడిపోయింది.... చనిపోయిందేమో!" అంది లహరి పెద్దగా కేకలు పెడుతూ.

ఉండేలుతో పిట్టను నేలకూల్చానన్న నా సంతోషం.... క్షణాల్లో ఆవిరైపోయింది. పిట్ట చనిపోతుందేమోనన్న భయంవేసింది. కంగారుగా చేతిలోని ఉండేలును అవతలకు విసిరేశాను.

పిట్ట పడిపోయిన చోటుకు వెళ్ళాం.

కదలికలు లేకుండా పడివుంది ఆపిట్ట... రాయి దెబ్బకి అదిరిపోయింది. గొంతు దగ్గర రక్తం చారికలు కన్పించేయి. పదినిమిషాలయ్యాక కొద్దిగా రెక్కలు కదిల్చి ఎగిరే ప్రయత్నంచేసిందిగానీ, కదల్లేకపోయింది.

"చనిపోలేదు. ప్రాణం వుంది" అంది లహరి.

మెల్లగా ఆ పిట్టని చేతుల్లోకి తీసుకున్నాను.

వణికిపోతూ నావైపు చూసిందది. దాని అమాయకపు చూపులు నన్ను ఇబ్బందిపెట్టాయి. ఘోరమైన తప్పుచేశాననిపించింది.

ఏడ్పువొచ్చినంత పనైంది.

లహరి కళ్ళు కూడా చెమ్మగిల్లాయి.

"ఇంటికి తీసుకెళ్దాం పద" అంది లహరి.

పిట్టని ఇంటికి తీసుకెళ్ళాక తడిగుడ్డతో అద్ది, నీళ్ళ తాగించాను. రెండు గుటకలు వేసిందది. నావైపు ఆప్యాయంగా చూస్తున్నట్లు అన్పించింది.

సజ్జలు, జొన్న గింజలు తెచ్చి పిట్టముందు వేశాం.

చిన్నప్పుడు ఆపిట్టను ఇబ్బంది పెట్టాను. అందుకే ఇప్పుడు నేనూ... పంజరంలో పక్షిలా వున్నాను.

❖ ❖ ❖

షాపింగ్ మాల్ నుంచి తిరిగివొచ్చి స్రవంతి పికప్ చేసుకుంది.

కాగితంమీద పంజరం బొమ్మ, అందులో ఓ గోరింక బొమ్మను గీసి స్రవంతికి ఇచ్చాను.

"చిన్నపిల్లల చేష్టలు పోలేదు నీకు. తోడునీడగా నేను లేకపోతే... పిచ్చిపట్టిపోయేది నీకు" అంది స్రవంతి నా జుత్తులోకి వేళ్లు పోనిచ్చి, సుతారంగా తలనిమురుతూ.

ఇంతకాలమూ ఒంటరితనం ఆవరించుకుపోయింది నా చుట్టూ. నన్ను ఎవరో పంజరంలో బంధించినట్లు అనుభూతి!

పడమరగాలి నాకు పడటంలేదు, నా ఒంటికి తూర్పుగాలే మంచిది.

"అమెరికాలో ఉండలేను. మన వూరు వెళ్ళిపోదాం" చంటి పిల్లాడిలా మారాం చేశాను.

తర్వాత కూడా... కాగితంమీద పంజరం బొమ్మ, అందులో చనిపోయిన చిలకబొమ్మ గీసి స్రవంతికి చూపించేవాడిని.

ఆమె భయపడిపోయింది. ఇండియా తిరిగెళ్లడానికి ఒప్పుతుంది.

స్వగ్రామం వెళ్ళేక ఎలా వుందంటే.... తల్లిపక్షి రెక్కల కింద గువ్వపిట్టలా నిశ్చింత!

స్రవంతికి కావల్సింది... నేను టెన్షన్ పడకుండా ప్రశాంతంగా ఉండటమే!

ఇప్పుడు వీలుచిక్కినప్పుడల్లా పొలాల్లో తోటల్లో డొంకలకు అడ్డంపడి నడుస్తున్నాను. అంతా తిరుగుతూనే వున్నాను.

నా సొంతవూళ్ళో నేనిలా తిరుగుతుంటే, గుండెల్లో ఇన్నాళ్ళూ గూడుకట్టుకున్న గుబులు తొలగిపోయినట్టయింది!

– విపుల, డిసెంబర్ 2011